ఐతే... నేను చూసిన... హాజరయిన... సన్మానాలన్నీ కాకపోయినా... వాటిల్లో అధిక శాతమయినా... యిలాంటి స్వకపోలమర్దనాలేనా?

ఒక్కసారెందుకో వెనక్కి తిరిగి చూశాను.

"డీలక్స్ సన్మాన కేంద్ర్..." బోర్డు దివ్యంగానూ జాజ్జ్వలంగానూ వెలిగిపోతోంది.

మనుషులలో గుర్తింపు పిచ్చి ఉన్నంత కాలమూ నేనిలాగే వెలిగి పోతుంటాను సుమా - అని నన్ను చూసి నవ్వుతున్నట్లే ఉండా బోర్డు.

ఆ క్షణంలో నేనొక నిర్ణయం తీసుకున్నాను.

ఒకవేళ... ఎవరయినా..... పొరపాటున నాకు సన్మానం చేస్తామన్నా... చచ్చినా తలవొంచకూడదు.

✡ ✡ ✡ ✡ ✡

# మాయా - మర్మమూ

చీకటి పడిపోయింది.

శ్రీకాకుళం బస్టాండు ఆట అయిపోయాక టెన్నిస్ కోర్టులా బోసిగా మిగిలిఉంది. పాసింజర్లూ సామానులూ లేక ఖాళీగా పడుకున్న బస్సులు పగటివేళ ప్రాస్టిట్యూట్స్‌లా పరమ వికారంగా ఉన్నాయి.

ఒక మూల ఒక బస్సు మాత్రం కిటకిటలాడిపోతూంది. కన్నెపిల్లలా పిటపిటలాడుతోంది. రంగు దీపాలతో - డిజైన్ల చీరకట్టిన చిన్నదానిలా మిడిసిపడుతోంది. ఆ బస్సు-దర్జాగా ఉంది. ధీమాగా ఉంది. ఆ కొత్తబస్సు, గతంలో కొంచెం అనుభవం చవిచూసి శోభనం గదిలోకి ఉరికెయ్యడాని కుల్లాసపడుతున్న వయసు పెళ్లికూతుర్లా ఉంది.

ఆ బస్సుమీదకు జనం ఎగబడుతున్నారు.

ఎవరికి వారే ఆ బస్సెక్కెయ్యాలని తాపత్రయ పడిపోతున్నారు. ఆరాటపడుతున్నారు. ఆందోళన పడుతున్నారు.

విశాఖపట్నానికి అది ఆఖరుబస్సు. కండక్టరు - కలక్టరమ్మ మొగుడిలా సీటులో కూర్చుని బస్సులోంచే టిక్కెట్లమ్ముతున్నాడు. జనం ఒకరి నొకరు తొక్కుకుంటున్నారు. తోసుకుంటున్నారు. ఇళ్లు కాలుతూంటే కోడి పెట్టల దొంగల్లా ఆ జనంలో కేటుగాళ్లు, కేడీగాళ్లూ కూడా లేకపోలేదు. పాసింజర్లు టికెట్లకోసం కండక్టర్ని ప్రాధేయపడుతున్నారు. ప్రార్థిస్తున్నారు. ఆత్రతతో కూడిన చిరునవ్వులు విసిరి చూస్తున్నారు. బస్సు తలుపులేసి ఉండటాన కండక్టరుగారి కాళ్లందక చేతులే పట్టుకోవాలని ప్రయత్నిస్తున్నారు.

టిక్కెట్లమ్మేసి, బస్సుదిగి, డ్రయివరు భుజంమీద చెయ్యివేసి విలాసంగా కాఫీ హోటలు వేపు నడవసాగాడు కండక్టరు.

మళ్లీ పాసెంజర్లు - అభిమాన సంఘాలు ఆరాధ్య నటుడ్ని వదలనట్లు గుమిగూడుతున్నారు.

కాళ్ళ కడ్డంపడుతూ టికెట్టు కోసం వేడుకుంటున్నారు. ఎలక్షన్లలో గెలిచేసి ఎమ్మెల్యే అయిపోయిన వాడిమల్లే కండక్టరు జనాలమీద విసుక్కుంటున్నాడు. పురుగులని వలె విదుల్చుకుంటున్నాడు.

బస్సుకీ, కాఫీ పాకకీ మధ్య ఏం చెయ్యాలో తోచక ఓ సారి బస్సునీ, మరోసారి కాఫీ పాకనీ మార్చి మార్చి చూస్తూ నిలుచున్నాడు నాగరాజు. చీకటి వాడి కళ్లలోని నీటిపొరలని ఎదుటివాళ్లనుంచి కప్పేస్తూంది.

ఇయాళ సీరామనవమి. వొయిజాగులో లంకాదహనం. అర్ధరాత్రి బీచీలో మాంచి సంబరం జరుగుతుంది. బీచొడ్డున - నవుద్రంలో కెరటాలంత జనం. పండగ రంజుగా చేస్తారు. జనాలొళ్లుమరచిపోతారు. అదే తనకి వీలు. కాని వయిజాగెళ్లడం ఎలా?

చచ్చీ చెడీ తీసుకెళ్లి నోటందిస్తే "టికెట్‌లే" దనేశాడు కండక్టరు. "మరో రూపాయి తీసుకొని స్టాండింగయినా... ప్లీజు" అని బతిమాలాడు. కాల్లు దొరక్క చేతులట్టుకున్నాడు. ప్లీజన్నాడు. తాంక్సన్నాడు. నోమెన్షనన్నాడు. ఆఖరికి సారీ కూడా అని చూశాడు. కాని కండక్టరు టికెట్టివ్వలేదు. జనం బయటికి లాగేశారు. ఇనస్టాల్టయిపోయింది. అది కాదు బాధ. ఇశాఖపట్నం ఎళ్లాలీ బస్సులో. సంబరానికెళ్లకపోతే సంవత్సరంపాటూ వస్తే. చిన్నోడికి సూది మందేయించలేదు. సీతాలుకి కోక కొనలేదు.

"రేపొద్దుటికి వంద రూపాయలూ తెచ్చి అప్పులు తీర్చి నాకో కోక కొనక పోయావో, యీ అధ్వాన్నపు సంసారం నే నీడవలేను. ఇంక నా వొల్లకాదు. ఎవడి తోనో లేచిపోతాను. కాకపోతే ముండల కంపెనీలో జేరిపోతాను. మూడురోజుల కోపాలయినా ముద్దకు నోచుకోకపోతే బతకడమెలాగ?" సీతాలుది బెదిరింపు కాదు. బాధ. ఆమె మాటల్లో ఒక్క అక్షరమూ అబద్ధంకాదు. బతుకు పెట్టే యాతనలన్నిటినీ భరించి భరించి విసుగెత్తిపోయి అన్నమాట లవి.

అవి గుర్తుకొచ్చి నాగరాజు గుండెలు జలదరించాయి.

కన్నీళ్లు ఆగకుండా జారిపోయాయి.

సీరామనవమి మీద సవాలక్ష ఆశలు పెట్టుకున్నాడు. ఇశాపట్నం ఎళ్లానికి టిక్కెట్ డబ్బులు చచ్చీచెడీ అప్పుజేసి సంపాదించాడు. పట్నం కదాని బట్టలు అద్దెకి పుచ్చుకున్నాడు. ఇశాపట్నంలో ఇంగ్లీషు పేలుదెక్కువని ప్లీజు, తాంక్యు, నోమెన్షను, సారీ... నేర్చుకున్నాడు.

ఇంతా అయ్యాక యీనగాచి నక్కల పాలు చేసినట్లు బస్సుకి టికెట్టు లేకండా పోయింది. రేపు సాయంత్రానికి అప్పులు తీర్చకపోతే తన్నులు తినాలి. సీతాలు నిజంగా ఎవడితోనో యింత తిండి పెట్టగలిగేవాడితో లేచిపోతుంది. చిన్నోడు సూదిమందు లేక చచ్చిపోతాడు.

సీరావనవమి... ఎన్ని ఆశలుపెట్టు కున్నాడు. ఎన్ని కలలు కన్నాడు. ఆ కలలు... తన బతుకు... అన్నీ ఏటయిపోవాల?

దుఃఖం బిగబట్టుకుంటున్నాడు.

దూరంగా ఇంజను గర్జిస్తూంది.

నాగరాజుకి ఆ బస్సుమీద బుస్సుమంటూ కోపమొచ్చేస్తూంది. ఈ బస్సు మిస్సయితే తన బతుకు మిస్సు, భార్య మిస్సు. అన్నీ మిస్సే.

తనకి టిక్కెట్టివ్వని కండక్టరుని కాలరుచ్చుకుని నాలుగు తన్నాలని పిస్తూంది వాడికి. దౌర్జన్యంగా అయినా సరే ఆ బస్సెక్కేసి వొయిజాగెళిపోవాల నుంది.

కాఫీలు తాగేశారు కాబోలు, కండక్టరూ డ్రయివరూ కిల్లీకొట్టుముందుకొచ్చేశారు.

బస్సెళ్లిపోతుంది బాబోయ్, బస్సెళ్ళిపోతుంది.

నాగరాజు గుండెలు దడదడలాడాయి. ఏడుపొచ్చేస్తూంది.

రామచెంద్రమూర్తికి దణ్ణం పెట్టుకున్నాడు. నవమి పూటా నన్ను అన్యాయం చెయ్యకని మనసులో దేవుడ్ని వేడుకుంటూనే బస్సు వేపు చూస్తున్నాడు.

నాగరాజు మనిషి, అంత త్వరగా ఓడిపోడు.

వాడిది ఆశ. అంత త్వరగా చావదు.

తనేం చేస్తూన్నాడో తెలియకుండానే బస్సువేపు అడుగులు వేస్తున్నాడు. నీరసంగా.

"వొయిజాగు టిక్కెట్టు కావాలా. ఒక్కటే ఉంది..."

చీకట్లో ముఖం కనిపించడం లేదు..

దేవుడా, రావుడా, సత్యశాయి బాబాయా?

క్షణం ఆలస్యం చెయ్యకుండా టిక్కెట్టు తీసుకుని..., బస్సు బొంయిమంటూ, బయలు దేరిపోతానన్నట్టు భయపెడతూంటే చేతికొచ్చిన పదిరూపాయల నోటుని ఆ మనిషి వేపు విసిరేసి

రాకెట్లా దూసుకుపోయి – బస్సులోకి దూరేశాడు నాగరాజు.

ఇంజనుతో ఒక్కసారిగా గర్జించి బస్సుకదిలింది.

సామాన్లనీ, స్టాండింగ్ పాసెంజర్లనీ దాటుకుంటూ వెనక్కి వెళ్లి ఓ గోనె మూటమీద సీటు కొట్టేసి ఊపిరి పీల్చుకున్నాడు.

బస్సు పరుగెడుతూంది. గాలి చల్లగా వీస్తూంది.

ఓసారి జేబులోంచి డబ్బు తీసుకుని చూసుకున్నాడు.

వాడికళ్లు మెరిశాయి. సంతోషం పట్టలేక పోయాడు.

దొరకదనుకున్న టిక్కెట్టు దొరికింది. అంటే అర్థమేటి? లక్కు తనని వొరించే సిందన్నమాట. సీరావనవమి సంబరంలో యివాళ పెద్ద బేరమేతగులుతుంది. ఏ యమ్మ గొలుసో? ఏ బాబు పరసో? మరే బాబు వాచీయో?

శ్రీకాకుళం పొలిమేరలు దాటి పోతూంది బస్సు.

అటూ యిటూ దీపాలయిపోయి చీకటి మొదలౌతూంది.

బస్సులో మసక వెలుతురు. కండక్టరు టిక్కెట్లనీ బుర్రలనీ లెక్కచూసుకుంటూ వస్తున్నాడు.

బస్సు – బుడుమూరు బ్రిడ్జి దాటి పోతూంది వేగంగా.

బస్సంటే యిలాగ పోవాలి కునుకు పాట్లుపడకుండా అని మెచ్చుకున్నాడు నాగరాజు. వాడికి ఎంతట వెళ్లి విశాపట్నంలో వాలుతానా అన్నట్లుంది.

సంబరంలో కొట్టేసే సంపద గురించి బంగారు కలలు కంటూనే కండక్టరడిగిన టిక్కెట్టు ముక్కని మహా ధీమాగా దర్జాగా అందించి ఓ నవ్వు కూడా నవ్వాడు.

టిక్కెట్టు చూసి నాగరాజు ముఖంలోకి చూసి డ్రయివరు దగ్గరకి వెళ్ళి రణస్థలం పోలీసు స్టేషను ముందు బస్సాపించి దిగాడు కండక్టరు.

ఎక్స్‌ప్రెస్సు బస్సు ఎక్కడపడితే అక్కడాపీడాని కెవడిచ్చాడు రూల్సని నాగరాజు చిరాకుపడుతూండగానే – కండక్టరు నాగరాజుని చూపించడమూ, వెనుకనున్న ఎర్రటోపీ ముందుకొచ్చి

నాగరాజుని బలవంతంగా బస్సులోంచి కిందకి లాగెయ్యడమూ జరిగిపోయింది.

తన కళ్ళముందే బస్సెళ్ళిపోతూంటే బారుమని ఏడిచాడు నాగరాజు. లాటీతో ఒకటేసి - స్టేషనులోకి లాక్కుపోయాడు కానిస్టేబులు. లాక్కెళ్ళి స్టేషనిన్చార్జి ముందు నిలబెట్టి - "కక్కుర్తి కేసు సార్... దొంగ టిక్కెట్టు...అర్.టి.సి.బస్సు..." అన్నాడు.

"దొంగ టిక్కెట్టా !...సత్తె ప్రమాణంగా...దేవుడి సాచ్చిగా...నిజంగా నాకేటి తెల్దు. అదెవడో అకరిచనంలో...చీకట్లో అంటగట్టాడు. మంచిదో కాదో చూసుకుందు కెవదీల్దేదు; ఎలుగూ లేదు. చీకటి...ముకమేనా చూడకుండా మనిషిని నమ్మి... టిక్కెట్టుచ్చేసుగున్నాను..ఇంతకంటే నాకేటి తెల్దు. నన్ను నమ్మండి. మహా ప్రభో..నే న్నిజమే చెప్పాను-"

వాడి మొర - వినిపించుకోబడలేదు.

వాడు గింజుకుంటూంటే నాలుగు లాటీ దెబ్బలు పడేసి - వాడి దగ్గర మిగిలిన డబ్బులు నొల్లేసుకుని - చీకటి సెల్‌లోకి తోసేసారు యిద్దరు కానిస్టేబుల్స్.

సరిగ్గా యిదే సమయానికి... శ్రీకాకుళం పోలీసు స్టేషనులో...కుర్చీనిండా కూర్చుని కులుకుతూ- మంచికేసొచ్చిందని మురిసిపోతూ చూశాడు సర్కిల్.

ఎదురుగా - అస్తిపంజరానికి కొంచం ప్రాణం పోసినట్లున్న మనిషి. వాడి కటూయిటూ ఎర్రటోపీల పోలీసులు.

"నిజంగా నేనేటీ ఎరగను. బస్టాండులో - ఇసాపట్నం టిక్కెట్టు అమ్మాను. కొన్నవాడి ముఖమేనా చూల్లేదు. చీకటి... నా టిక్కెట్టు తీసుకొని పదిరూపాయల నోటిచ్చాడు. అది మంచిదో చెడ్డదో కనుక్కోలేక పోయాను. మనిషిని నమ్మినట్లే నోటునినమ్మి బియ్యం దుకాణం కాడకొచ్చాను.

వారం రోజులై నా పెళ్ళానికూడు లేదు. నా పిల్లలాకలికి సొమ్మసిల్లిపోతున్నారు. నేను నూకలట్టుకు రాకపోతే పెళ్ళాంవూ పిల్లలూ కట్ట కట్టుకుని నూతిలో ఉరికి చస్తామన్నారు. అందుకని... మేం బతకాలని... బస్టాండులో దొంగ టిక్కెట్టమ్మాను. ఆడెవడో నాకంటే దరిద్రుడు...దొంగనోటంట గట్టాడు. ఇంతకంటే నాకే మాయా మర్మమూ తెలీవు..."

"కథల్చెప్పకోరేయ్...నా కొడ్కుమంట. నిజంచెప్పు..." కసిరాడు సర్కిలు.

పోలీసులు యధాశక్తి చెరో లాటీ వేశారు వాడి వీపుమీద.

"మీరు కొట్టినా కారడానికి నా వొంట్లో రక్తం లేదు. మీరెంత అడిగినా కక్కడానికి నా దగ్గరింకేమీ నిజమూ లేదు. దొంగనోటు నాదికాదు. నా దొంగ టిక్కెట్టు కొన్నవాడే - ఆ దగుల్బాజీ గాడే నాకంటగట్టాడు. ఈ పాటికి - నేన్నూకలట్టుకు రాలేదని - నా పెళ్ళాం పిల్లలు నూతిలో కురికి సచ్చేసి ఉంటారు. నన్ను కొట్టకండి. చంపెయ్యండి. మీ యిష్టమొచ్చినన్ని కేసులు నామీదెట్టేసి - నన్నొక్క సారి ప్రాణం తీసెయ్యండి. నేను కాదన్ను. నేనిప్పుడే బతికిలేను. నన్ను కొట్టి కొట్టి సంపకండి..."

"మొండి వెధవ- " పళ్లు కొరికాడు సర్కిలు - బూటుతో తంతూ.

కానిస్టేబుల్సు - ఆ నేరస్తుడినీ చీకటి సెల్‌లోకి యీడ్చేశారు, మునిసిపాలిటీ వాళ్ళు శవాన్ని యీడ్చేసినట్లు.

అక్కడ దొంగనోటు నాగరాజు, ఇక్కడ దొంగ టిక్కట్టుసామీ ఒకరినొకరూ - తమ బతుకులను తిట్టుకుంటున్నారు - రాతి గోడలమధ్య.

✡ ✡ ✡ ✡ ✡